పోలియోపై అప్రమత్తం : డాక్టర్ నితిన్ చావ్లా

ప్రజాశక్తి - హైదరాబాద్
మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో పోలియో మైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరమని కిమ్స్ హాస్పిటల్ పీడియాట్రిక్స్ చీఫ్ డాక్టర్ నితిన్ చావ్లా పేర్కొన్నారు. పోలియో ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి అని అన్నారు. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఇది కోలుకోలేని పక్షవాతమని, కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుందని తెలిపారు.

వెనక్కి తగ్గేదేలే...

- నవంబర్ 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- త్వరలో అఖిలపక్ష సమావేశం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్ప.. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే వెయ్యిసార్లు ఆలోచిస్తామని.. తీసుకున్నాక వెనక్కి వెళ్లేది లేదన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నవంబరు 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబరులో ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

"భారాస నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి ఇబ్బంది అయితే మంత్రులు, అధికారులను కలిసి చెప్పొచ్చు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో టెండర్లు పిలుస్తాం. మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ప్రజాప్రతినిధులను పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపాను. ఈ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన కలిగింది. మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోంది. విచారణ సమయంలో కక్ష సాధింపు ఉండదు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయి. రాజకీయంగా నష్టం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరుతాం. ముఖ్యమంత్రి అవ్వాలనుకున్న నా కల నెరవేరింది. ముఖ్యమంత్రి పదవి కంటే పెద్ద కలలు నాకు వేరే ఏమీ లేవు.

గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది..

' కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా.. నేను రుణమాఫీ చేశా. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశాం. మూసీ కోసం భూములిచ్చేవారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తాం. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోం. ప్రాజెక్టును ఎన్‌జిఒలు వ్యతిరేకిస్తే అర్థం ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావట్లేదు. మూసీని బాగు చేసే అంశంలో కెటిఆర్ తన ఆలోచనలు చెప్పొచ్చు. అంతర్జాతీయ అవగాహన ఉన్న ఆయనకు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా? ఈ ప్రాజెక్టుపై కేటీఆర్ నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నా. నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని.. గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది. 55 కి.మీ మూసీ పునరుజ్జీవం పూర్తయితే అద్భుత నగరం ఆవిష్కృతమవుతుంది' అని అన్నారు.

జన్వాడ ఫామ్‌హౌస్‌పై కట్టుకథలు

"దీపావళి అంటే ఎవరైనా చిచ్చుబుడ్లు కాలుస్తారు. కానీ, జన్వాడ ఫామ్‌హౌస్‌లో మాత్రం సారాబుడ్లు బయటికొచ్చాయి. అనధికార విదేశీ మద్యంతో కెటిఆర్ దీపావళి జరుపుకొంటున్నారా? జన్వాడ ఫామ్‌హౌస్‌పై బిఆర్ఎస్ కట్టుకథలు హాస్యాస్పదం. ప్రభుత్వం చేసే మంచి పనులకు మీడియా సహకరించాలి. మూసీ పరివాహకంలో సమయం వచ్చినప్పుడు పాదయాత్ర చేస్తా. అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా. భారాస అక్రమ సొమ్ముతో సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారం చేస్తోంది. ఎంతో ఆలోచించి హైడ్రాను రంగంలోకి దింపాం. హైడ్రాపై దేశమంతా తెలిసేలా భారాస ప్రచారం చేసింది. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదు.. దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చింది. రూ.7.50 లక్షల కోట్ల అప్పులు కెసిఆర్ మిగిల్చి వెళ్లారు. రుణమాఫీలో సాంకేతిక లోపాలు ఉన్నవి మాత్రమే ఆగాయి. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. టిజిపిఎస్‌సి నియామకాల్లో 90శాతం బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకే. నాది చిన్నవయస్సు.. రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉంది. అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేను. అందరి విషయంలోనూ ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తాం" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

బాబ్లీ గేట్లు మూసివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎస్సారెస్పీకి ఎగువ భాగంలో గోదావరి నదిపై మహారాష్ట్రలో ఉన్న బాబ్లీగేట్ ప్రాజెక్టు గేట్లను మంగళవారం మూసివేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతేడాది వర్షాకాలం సీజన్ ప్రారంభమయ్యే జులై 1వ తేదీన ప్రాజెక్టు గేట్లు తెరిచి.. సీజన్ ముగిసిన అనంతరం అక్టోబర్ 29న మూసివేయాల్సి ఉంటుంది. దాంట్లో భాగంగా బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లు సిడబ్ల్యూసి కమిటీ సమక్షంలో మూసివేసినట్టు ఎస్సారెస్పీ డిఇఇ గణేష్ తెలిపారు. కాగా దిగువకు నీటి విడుదల నిలిచిపోయింది. తాగునీటి అవసరాల కోసం మార్చి 1వ తేదీన గేట్లు ఎత్తి దిగువకు 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ టి.శ్రీనివాస రావు గుప్త, నాందేడ్ ఈఈ సీఆర్ బన్సోడ్, సిడబ్ల్యూసి ఈఈ వెంకటేశ్వర్లు, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, డిఇఇ గణేష్, ఏఈఈ రవి, సిడబ్ల్యూసి ఎస్డీఈ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నిండుకుండలా ఎస్సారెస్పీ

సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున వరద నీరు వచ్చిచేరడంతోఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టంతోనిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా అదే స్థాయిలో నీరు నిల్వ ఉంది. 9454 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. కాకతీయ కాలువతో పాటు వరద కాలువకు అదే స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు.

6 నుంచి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో నవంబర్ 6 నుంచి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్ని విషయలనూ చేరుస్తామన్నారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా జరిగిన అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా నుంచి పాల్గొన్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో వివిధ జిల్లాల కేంద్రాల నుంచి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, డి.అనసూయ (సీతక్క), జూపల్లి కష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కష్ణభాస్కర్, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ ఎస్.హరీష్ తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం మన సమాజంలో సమానత్వాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకుందనీ, ఆ మేరకు రాష్ట్రంలో వివిధ జాతుల సామాజిక, ఆర్థిక, ఆదాయ, విద్యా, రాజకీయ స్థితిగతులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే మనం మన సమాజంలో సమానత్వం కోసం విధానాలను రూపొందించగలమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో సామాజిక సర్వే గొప్ప లక్ష్యాన్ని సాకారం చేయనుందన్నారు. ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించించడం, ప్రతి ఎన్యూమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, గృహ సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్ల మాన్యువల్ అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై ఎన్యూమరేటర్లకు పూర్తి అవగాహన ఉండేలా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సర్వేను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజూ పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలని చెప్పారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలని సూచించారు. సామాజిక కుల గణనను ప్రచారం చేయడానికి మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి కలెక్టర్లను కోరారు.

కాలం చెల్లిన మందులు.. ఫిజీషియన్ల శాంపిళ్లు

- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రయివేటు మెడికల్ షాపుల దందా
- డిసిఎ దాడుల్లో విస్తుపోయే నిజాలు
- షోకాజ్ నోటీసులు జారీ

హైదరాబాద్ బ్యూరో : ప్రభుత్వాస్పత్రుల ప్రాంగాణాల్లో కొలువుదీరిన ప్రయివేటు మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులు బయటపడ్డాయి. ఫిజిషియన్ శాంపిళ్లు ఆ మెడికల్ షాపుల్లో దర్శనమిచ్చాయి. నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్న ఆ మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు జరిపిన దాడుల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. డ్రగ్ కంట్రోల్ అధికారులు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని పలు ఆస్పత్రుల్లోని ప్రయివేటు మెడికల్ షాపులపై ఏకకాలంలో దాడులు చేశాయి. 15 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో ప్రాంగణంలోని వైష్ణవి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, జీవన్ ఉష ప్రవంతి జెనరిక్ మెడికల్ స్టోర్స్, కులీ కుతుబ్ షా మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, జీవన్ ధారా ఫార్మసీ, అమ్రిత్ ఫార్మసీ (హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ లిమిటెడ్ యూనిట్), నిలోఫర్ ఆస్పత్రిలో ప్రాంగణంలోని సాయి ఫార్మసీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్, అమ్రిత్ ఫార్మసీ, పెట్లబురుజు ప్రసూతి ఆస్పత్రి ప్రాంగణంలోని జన జీవనీ జ్యోతి స్టోర్స్‌పై దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్‌లో గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో తిరుమల మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, శ్రీసాయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, జీ.పీ.మోహిత్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో ప్రజారోగ్య ఫార్మసీ (ఉమెన్ మెడికల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్) అమ్రిత్ ఫార్మసీ (హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ లిమిటెడ్ యూనిట్), రాణి రుద్రమ దేవి జీవన్ ధారా ఫార్మసీ తో పాటు కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ జీవన్ ధారా ఫార్మసీ (జెనెరిక్ మెడికల్ షాప్), ప్రజారోగ్య ఫార్మసీ (ఉమెన్ మెడికల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్)లలో దాడులు చేసిన తనిఖీలు చేశారు. మెడికల్ షాపులపై దాడుల సందర్భంగా నిబంధనలను అనేక రకాలుగా ఇవి ఉల్లంఘిస్తున్నట్టు బయటపడిందని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్ రెడ్డి తెలిపారు. మెడికల్ ప్రాక్టీషనర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల అమ్మకం, రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్ లేకపోవడం, షెడ్యూల్డ్ డ్రగ్స్‌కు సంబంధించిన రిజిస్టర్లు లేకపోవడం, సేల్స్ అండ్ పర్చేస్ బిల్లులను చూపించలేకపోవడం, స్టోరేజ్ కండిషన్ల మేరకు మందులను స్టోర్ చేయకపోవడం, ఫిజిషియన్ల శాంపిళ్లు, ప్రభుత్వ సరఫరా మందులు, కాలం చెల్లిన మందులున్నట్టు దాడుల్లో వెల్లడైంది. షోకాజ్ నోటీసులకు సంబంధిత మెడికల్ షాపుల యాజమాన్యాలు వివరణ ఇచ్చిన తర్వాత డ్రగ్స్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని కమలాసన్ రెడ్డి పేర్కొన్నారు.

ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్‌గా
హరీష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా డాక్టర్ ఎస్ హరీష్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సమాచార్ భవన్‌లో సమాచార శాఖ అదనపు డైరెక్టర్ నాగయ్య, జెడి జగన్, ఎడిలు యామిని, శ్రీనివాస్, హష్మి తదితరుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించే ఫైలుపై సంతకం పెట్టారు. అనంతరం సమాచార శాఖ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఐఎఎస్ అధికారి అయిన హరీశ్ గతంలో పలు జిల్లాల్లో కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్న హరీశ్‌ను ప్రభుత్వం కీలకమైన సమాచార శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది.

డ్రగ్స్ టెస్టుల ద్వారా తప్పుడు కేసో, వాస్తవ కేసో తేలుతుంది

- పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
పోలీసులు చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తే బిఆర్ఎస్ నాయకుల అది తప్పుడు కేసు అని అంటున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ అన్నారు. అది తప్పుడు కేసో, వాస్తవ కేసో తేలాలంటే కేటీఆర్ డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలని చూస్తున్నారని చెప్పారు. పదేళ్ల పాలనలో డ్రగ్స్ విచ్చల విడిగా వ్యాపించిందంటూ కెటిఆర్ అంటున్నారని తెలిపారు. ఫామ్‌హౌస్‌లో దీపావళి, గృహ ప్రవేశం పంక్షన్ అంటున్నారని, అదే నిజమైతే అర్ధ రాత్రి రెండు గంటల వరకు పార్టీ జరుగుతందా? అని ప్రశ్నించారు. కెటిఆర్ బామ్మర్ది సన్నిహితుడికి పాజిటివ్ ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు

సెంట్రల్ బ్యాంక్ విజిలెన్స్ 'వాకథాన్'

ప్రజాశక్తి - హైదరాబాద్ :ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ విజిలెన్స్ అవర్‌నెస్ వారోత్సవాలు నిర్వహిస్తోంది. అక్టోబర్ 28 నుంచి నవంబర్ మూడు వరకు చేపట్టనున్న ఈ వారోత్సవాల్లో భాగంగా బ్యాంకింగ్ రంగంలో పారదర్శకత పెంచడానికి సాధారణ ప్రజానానికి పలు అంశాల్లో అవగాహన పెంచుతున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగానే మంగళవారం కోటి బ్యాంక్ స్ట్రీట్‌లో వాకథాన్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్, డిజిఎమ్ కనక రాజు, రీజినల్ హెడ్ రామక్రిష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

తల తాకట్టు పెట్టయినా
రుణమాఫీ చేసి తీరుతాం

- రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులు పెడతాం
- అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు : మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులున్నా తల తాకట్టు పెట్టయినా రూ. రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇటీవల భారీ వర్షాలకు మండలంలోని బీరోలు పెద్ద చెరువు పూర్తిగా తెగిపోవడంతో మూడు కోట్ల వ్యయంతో పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోల్‌తండా గ్రామ పంచాయతీలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ మిల్‌లో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం తిరుమలాయపాలెం హైస్కూల్లో 8, 9, 10 చదువుతున్న విద్యార్థినీలకు పిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రూ.18 వేల కోట్ల రైతుల రుణాల మాఫీ చేశామని, ఇంకా చేయాల్సి ఉన్న రూ.13 వేల కోట్లు మాఫీని డిసెంబర్‌లోగా పూర్తి చేసి తీరుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, రైతులకు అనుగుణంగా జిల్లాలో తొమ్మిది పత్తి సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి రైతు సిసిఐ కొనుగోలు కేంద్రానికి పత్తి విక్రయించేందుకు తీసుకొస్తే అరకేజీ తరుగునూ తీయొద్దని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కల్పించాలని సూచించారు. తరుగు తీస్తే తాట తీస్తానని హెచ్చరించారు. రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, తిరుమలాయపాలెం మండల తహసీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ సిలార్ సాహెబ్, మండల వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ డైరెక్టరేట్ మంజూరు

- మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్ బ్యూరో : ఆయుష్ డైరెక్టరేట్‌ను మంజూరు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ ఎర్రగడ్డలోని ఆయుర్వేద మెడికల్ కాలేజీలో నిర్వహించిన 9వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, వరంగల్‌లోని కాలేజీల్లో ఆయుష్ యుజి, పిజి సీట్ల సంఖ్యను పెంచనున్నట్టు చెప్పారు. విద్యార్థుల కోసం కొత్త హాస్టల్ భవనం నిర్మిస్తామని, వారం రోజుల్లో విద్యార్థుల ఉపకారవేతనాలు చెల్లించనున్నట్టు వెల్లడించారు స్టైఫండ్ పెంపు అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన 628 మంది పార్ట్ టైమ్ యోగా ఇన్‌స్ట్రక్టర్లకు అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేసిన మంత్రి, ఇంకా 214 యోగా ఇన్‌స్ట్రక్టర్లు త్వరలో నియమిస్తాని చెప్పారు. యోగా, ఆయుర్వేదం మతానికి సంబంధించిన అంశాలు కాదని, మానవశరీరం, జ్ఞానం, మనస్సుకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. వీటిని గ్రామాల్లోకి తీసుకెళ్లాలనీ, వీటి ప్రాముఖ్యతను పిల్లలకు నేర్పించాలనీ, ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా జడ్ చొంగ్తూ మాట్లాడుతూ 421 ఆయుర్వేద మందిరాల్లో యోగా టీచర్లను నియమించినట్టు తెలిపారు.

సిగ్నేచర్ గ్లోబల్‌కు రూ.1203 కోట్ల కాంట్రాక్టు

హైదరాబాద్ బ్యూరో : రియల్ ఎస్టేట్ డెవలపర్ కంపెనీ సిగ్నేచర్ గ్లోబల్ తాజాగా రూ.1,203 కోట్ల కాంట్రాక్టును పొందినట్లు తెలిపింది. ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ గూర్‌గావ్‌లో చేపడుతున్న టైటానియం ఎస్‌పిఆర్ నివాస ప్రాజెక్టును దక్కించుకున్నట్లు పేర్కొంది. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.2,700 కోట్ల మేర ఉండొచ్చని పేర్కొంది.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT MALUR
O.S. No. 169/2020
BETWEEN: Smt. T. Anasuya & others ... **PLAINTIFFS**
AND: Sri. K.B. Subbaramaiah and others **DEFENDANTS**
NOTICE TO DEFENDANT NOS.100, 103, 104,110,114,119 and 123
To, **100. Sri.Suresh Babu Sadhu**, S/o. S. Sai Babu, aged about 48 years, Residing at No.4-16-231, Bharath Pet 0th lane, Guntur Andra Pradesh- 522 002. **103. Sri.Srinibash Katula**, S/o.K.Babu Rao, aged about 55 years, Residing at No.105, Gayatri Nilayam, Near Chandra Nagara Police Station, Chandra Nagara, Hyderabad, Andhra Pradesh-50. **104. Sri.A.Siva Kumar**, S/o. A. Ramalingeshwara Rao, aged about 44 years, Residing at No.104, B-Block, Suryajyothi Apts, Opp, Vijetha Super Market, KPHB 6th Phase, Kukatpalli, Hyderabad, Andhra Pradesh-72. **110. Sri.Gubbala Prasad Rao**, S/o.Gubbala Venkatarao, aged about 75 years, Residing at No.73-16-15/2, Srinivasa Gardens, Anala Venkatappa Rao Road, Shyamala Nagar, Rajahmundry, Andra Pradesh - 533 103. **114. Sri.Kodali Sambasiva Rao**, S/o.Kodli Gopal Krishna, aged about 73 years, Residing at No.2-39-16, Sakhamuri Vari Street, Burripalem Road Tenali, Guntur Dist., Andhra Pradesh - 522 201. **119. Sri.Dhanikela Dasthagiri Babu**, S/o. Dhanikela Venkataiah, aged about 40 years, Residing at No.75/29-1, 6th Road, Vijayadurga Colony, Near Builtop, Kadapa - 516 001. (Y.S.R District) Andhra pradesh. **123. Sri. Indukuri Janaki Ramaraju**, S/o. Indukuri Peddiraju, aged about 41 years, Residing at No.1-86, Peddaveedi, Ardhavaram, Ganapavaram Mandal, West Godavari, Andhra Pradesh - 534 197.
SUIT SUMMONS TO THE ABOVE DEFENDANTS U/O V RULE 20(1A) CPC
To, Take notice Defendant Nos. 100, 103, 104, 110, 114, 119 and 123, the Plaintiffs have filed the suit seeking relief of Declaration against the Defendants before the Senior Civil Judge at Malur pending for consideration.
The case is posted on **02/12/2024** at **11:00 A.M** for your appearance.
You are hereby directed to take notice and appear before above said court either in persons or through duly instructed pleader failing which the above petition will be decided in your absence placing you exparte.
Given under my hand and seal of the Court on this 24/10/2024 at Malur
By order of the Court, Chief Ministerial Officer, Senior Civil Judge Court, Malur
Advocate for Plaintiffs
V.M. SRINIVASA MURTHY
Kolar

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (EXCISE)-CUM-V ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS-CUM-V AJCJ, RANGA REDDY DISTRICT, AT : L.B.NAGAR
S.T.C.NI. 667 OF 2023
BETWEEN:
T.RAMA KRISHNA ...PETITIONER
AND
DESHARAJU VENKATESWAR RAO ...RESPONDENTS
To
Desharaju Venkateswar Rao, R/o H.No.24-171, Ranga Reddy Nagar, IDPL, Hyderabad- 500 055.
NOTICE
The Petitioner herein had filed the above petition under Section 200 of Cr.P.C. R/w Section 138 & 142 of N.I.Act, 1982 against you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above Petition and the matter is posted to 26.11.2024 at 10.30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.
[BY ORDER OF THE COURT]
Sd/- M.VIJAY KUMAR,
Advocate,
6-29/2, Road No.3,
Madhurapuri, Almasguda Village,
Balapur Mandal, Ranga Reddy District.

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (EXCISE)-CUM-V ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS-CUM-V AJCJ, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
S.T.C.NI.665 OF 2023
BETWEEN:
T.RAMA KRISHNA ...COMPLAINANT
AND
M/s.ANU SECURITY AGENCY, ...ACCUSED
To
M/s.Anu Security Agency, Rep by its Proprietor, S.Giridhar Rao, S/o Ranga Rao, # Corner Stone Apartment, Balreddy Nagar, Beside Siddartha School of Excellence, Quthubullapur, Hyderabad-500055.
NOTICE
The Complainant herein had filed the above petition under Section 200 of Cr.P.C. R/w Section 138 & 142 of N.I.Act, 1982 against you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above Petition and the matter is posted to **26.11.2024** at **10.30** a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.
[BY ORDER OF THE COURT]
Sd/- M.VIJAY KUMAR,
Advocate,
#6-29/2, Road No.3,
Madhurapuri, Almasguda Village,
Balapur Mandal, Ranga Reddy District.

IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM-V ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
M.V.O.P.NO.371 OF 2023
BETWEEN:
PERUMANDLA JANAIAH ...PETITIONER
AND
R.CHANDRA JYOTHI AND ANOTHER ...RESPONDENTS
To
R-1 R.CHANDRA JYOTHI, W/o R.Ramesh Rao, Aged: Major, Occ: Owner of the Hero Honda Passion Plus bearing No.AP-28D-3929, R/o Flat No.207, Block-B, Hima Sai Poojitha Apartments, Doctors' Colony, Saroornagar, Hyderabad-500035.
NOTICE
The Petitioner filed the above O.P. seeking compensation under MV Act for the injuries sustained by him in aa Motor Vehicle Accident against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above O.P. and the matter is posted to **04.11.2024** at **10.30** a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.
[BY ORDER OF THE COURT]
Sd/- M.VIJAY KUMAR,
Advocate,
6-29/2, Road No.3,
Madhurapuri, Almasguda Village,
Balapur Mandal, Ranga Reddy District.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. NO. 3963 OF 2024
BETWEEN:
1.) Smt. P. Malleshwari,W/o. P. Srinivas D/o. Late. Smt. R. Lingamma and Late. Sri. R. Laxmaiah, R/o. # 4-1-86, Hanuman Tekdi,Troop Bazar, Hyderabad-01.
2.) Sri. R. Raju,S/o. Late. Smt. R. Lingamma and Late. Sri. R. Laxmaiah,
3.) Sri. R. Praveen Kumar, S/o. Late. Smt. R. Lingamma and Late. Sri. R. Laxmaiah,
4.) Smt. R. Varalaxmi, W/o. Late. Sri. R. Venkatesh,
5.) Sri. Abhilash Rasamallah, S/o. Late. Sri. R. Venkatesh,
(Plaintiff Nos. 2 to 5 are R/o. 8-2-684/99/a, N.B.T Nagar, Road No. 12, Banjara Hills, Hyderabad, Telangana – 500 034).
6.) Smt. K. Abhisarika, W/o. Kothwal Raghu and D/o. Late. Sri. R. Venkatesh, R/o. 6-2-96/1, Fish Market, Siddipet, Medak Dist., Telangana – 502 103. ...PLAINTIFFS
AND
1.) The Tahsildar, Khairtabad, Shaikpet Mandal, Hyderabad-08.
2.) All Concerned ...DEFENDANTS
To
All Concerned, Khairtabad, Shaikpet Mandal, Hyderabad-08.
Please take notice that the above-named Plaintiffs have filed the above suit for Declaration against the Defendants viz., to declare the Plaintiff Nos. 1 to 3 as the legal heirs of Late. Smt. R. Lingamma and Late. Sri. R. Laxmaiahand also, the Plaintiff Nos. 4 to 6 be declared as the legal heirs of Late. Sri. R. Venkatesh. That the abovesuit is posted on dt: 06-11-2024 at 10:30 A.M. for objections, if any, failing which the matter will be decided on merits thereupon.
// BY ORDER OF THE COURT //
MR. ANISH SAHGAL
ADVOCATE
Off. at: H.No. 5-8-344/2, Abids, Chirag Ali Lane, Hyderabad-01.

IN THE COURT OF SECOND ADDL. DIST SESSION JUDGE COURT AT BALLARI
R.A. No:54/2023
Between:
Madire Basappa **...Appellants**
AND
Kothapalli Subbarao & others **...Respondents**
NOTICE
To,
RESPONDENTS NO.2:-
R-2: Kamineni Venkateshwara Rao S/o Late. Kamineni Subbarao. aged about 46 years Private Job R/o, Bhasakar Rao Nagar near SBI. Saninikpuri, Hyderabad, Telangana State. Mob No. 9246119846.
WHEREAS, the above name appellants has filed the above appeal against the respondents seeking partition and separate possession of their share in the suit properties
You are here by directed to appear before this Hon'ble court in person or by pleader duly instructed able to answer all material questions relating to the case or who shall be instructed and able to answer all such question on the day of dt: 26/11/2024 at about 11:00 '0' clock in the forenoon to answer the claim and further you are hereby directed to file on that day your objections and to produce on the said day all documents in your possession or power upon which, you base your defence or claim for set off or counter claim in support off your defence. Take notice that default of your appearances on the day before mentioned, the petition will be heard and determined in your absence. Given under my hand and seal of the court on this 28th day of october 2024.
(By order of the court)
Shirestedar
Chief Administrative Officer
Prl.District & Sessions Court
Ballari
M.BASAVARAJU
Advocate for the Appellents.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే ఎలా?

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో "ఫీజు దీక్ష"

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి నాగరాజు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే పేదల ఉన్నత చదువులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం 'ఫీజు దీక్ష', నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో పెట్టడం అంటే పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన "ఫీజు దీక్ష" రాష్ట్ర అధ్యక్షులు మూర్తి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేండ్లు ఫీజులు ఇవల్లేదని.. తాము అధికారంలోకి వస్తే విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క రుపాయి విడుదల చేయలేదన్నారు. ప్రయివేటు యాజమాన్యాలు సమ్మె ప్రకటిస్తే చర్చలు జరిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి ఇచ్చిన హామీ నెరవేరలేదని చెప్పారు. టోకెన్ ఇచ్చిన బిల్లులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో రూ. 8,214కోట్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను చెప్పుకుందామంటే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, న్యూఏరా విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రవణ్ కుమార్, టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎ.విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి.జావేద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హస్మిబాబు సంఘీభావం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. అనంతరం అక్కడే ధర్నా చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫీజు దీక్ష చేపట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఫీజుదీక్షలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన దీక్షలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పరి రవికుమార్ పాల్గొన్నారు. మెదక్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నిరసన తెలిపారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ నినాదాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎన్నికల మ్యానిఫెస్టో హామీల అమలేది?

- ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వస్తువుల్లేవ్
- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. నల్లగొండ జిల్లా హాలియా పట్టణ కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన యుటిఎఫ్ పెద్దవూర, హాలియా, తిరుమలగిరి సాగర్ మండలాల మహాసభలో ఆయన మాట్లాడారు. పదేండ్లుగా విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత విద్యారంగంలో కొన్ని రకాల ప్రయోజనాలు జరిగాయన్నారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు, నూతన నియామకాలు జరిగాయని తెలిపారు. ప్రతి మండలానికీ రెగ్యులర్ ఎంఈఓని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. జీపీఎఫ్‌లో ఉన్న పెండింగ్‌లను విడుదల చేయాలని, పిఆర్‌సిని ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల విషయంలో నాణ్యమైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. 317 జిఒతో స్థానికత కోల్పోయిన టీచర్లకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వస్తువులు లేక ఈ విద్యా సంవత్సరంలో 2 లక్షల 50 వేల మంది విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తక్కువ అయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ఇటీవల ఐదు డిఎలలో ఒక డిఎ మాత్రమే విడుదల చేయడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయులంతా ఏకమై ఉద్యమాలు చేయకముందే ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం "ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్–ఉపాధ్యాయుల పాత్ర" అనే అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎం రాజశేఖర్ రెడ్డి, జి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుమాల వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శులు వి.రాజు, ఆర్.రమాదేవి, ఎన్ వెంకన్న, కె విజయలక్ష్మి, ఎ చిన్న వెంకన్న, అనుముల, పెద్దవూర, తిరుమలగిరి సాగర్ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నెం వెంకటేశ్వర్లు, చింతపల్లి రవీందర్, ఎస్‌కె సయ్యద్ మియాత్, రామావత్ కృష్ణ, ఏర నాగుల సైదులు, గంజి శ్రీదేవి పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న చావరవి

తెలంగాణ ఉద్యమ చరిత్ర భవిష్యత్ తరాలకు అందాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమ తొలి, మలి దశ చరిత్ర భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, స్వరాష్ట్ర సాధన ఉద్యమ ఘట్టాల నేపథ్యాన్ని విస్తృత స్థాయిలో ప్రజలకు వివరించేందుకు సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ కృషి చేయాలని కోరారు. మంగళవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డి)లో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ విభాగం అధిపతిగా కెప్టెన్ పాండురంగారెడ్డి బాధ్యతలు తీసుకున్న కార్యక్రమానికి చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గొప్పతనం, చారిత్రక విశిష్టతను రాబోయే తరం తెలుసుకునే విధంగా రచనలు అందుబాటులో ఉండే విధంగా తెలంగాణ చరిత్రకారులు, కవులు, రచయితలు, సంస్థలు, ఉద్యమకారులు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ తొలి, మలిదశ ఘట్టాలు, మలిదశ ఉద్యమాన్ని రగిలించిన తన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల సంతకాల సేకరణ, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకత గురించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి వివరించిన ఘట్టాలను, చరిత్రను కూడా రాబోయే తరానికి అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్‌తో చిన్నారెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ చరిత్రకు సంబంధించిన రచనలను ఈ సంస్థ ద్వారా ప్రచురించాలని చిన్నారెడ్డి కోరగా, అందుకు శశాంక్ గోయల్ సమ్మతించారు. ఈ కార్యక్రమంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి అధికారి మాధవి రావులపాటి పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్ర

- గౌరి సతీష్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు బద్నాం చేసే కుట్ర చేస్తున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి గౌరిసతీష్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వం అంటున్నారని విమర్శించారు. తొమ్మిదిన్నరేండ్ల ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ వేయని అసమర్థ ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా? అని హరీశ్‌రావును ప్రశ్నించారు. తెలంగాణ రైతుల పట్ల నీటి బుడగల్లాంటి మాటల చెప్తే ఎవ్వరూ నమ్మబోరని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మోసాన్ని రైతులు ఎప్పటికీ మర్చిపోరని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ తెలంగాణలో చేసిందని ఆయన తెలిపారు.

ప్రజావాణికి 588 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 588 దరఖాస్తులు అందాయి. మైనారిటీ వెల్ఫేర్ శాఖకు 221, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 98, విద్యుత్ శాఖకు 84, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 4, ఇతర శాఖలకు 126, దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సమాచార, పౌరసంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

ఆరోగ్యశ్రీ రోగులకు రవాణా ఛార్జీలు మొత్తం ఇప్పించండి

- గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు రోగి కుమారుని ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల ఆస్పత్రి గాంధీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ రోగులకు రవాణా ఛార్జీలను పూర్తిగా చెల్లించడం లేదు. ఆస్పత్రికి వచ్చి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకున్న వారికి వారి గ్రామం నుంచి ఆస్పత్రికి రానుపోను ఛార్జీలను చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే గాంధీలో మాత్రం అతి తక్కువగా ఇస్తున్నారని ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు, యూరాలజీ విభాగంలో చికిత్స చేయించుకుని డిశ్చార్జి అయిన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం, సిరిపురం గ్రామానికి చెందిన వెంకయ్య కుమారుడు కాంపాటి ధనుంజయ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ గ్రామం గాంధీ ఆస్పత్రి నుంచి 250 కిలోమీటర్లకుపైగా దూరం ఉంటుందనీ, అక్కడ్నుంచి గాంధీ ఆస్పత్రికి వచ్చేందుకు ఒక మనిషి కనీసం రూ.350, తిరిగి వెళ్లేందుకు రూ.350, మొత్తం రూ.700 అవుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లోనూ రోగులకు ఇచ్చే రవాణా ఛార్జీలను పెంచినా గాంధీ ఆస్పత్రిలో మాత్రం కేవలం రూ.150 మాత్రమే ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి పేద రోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరసన సదస్సులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

- రైతాంగం నిరసనతో జంగు సైరన్ మోగింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు, కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులకు చేసిన వాగ్దానాలను ఎగ్గొట్టిన సిఎం రేవంత్‌రెడ్డి.. ఎనుముల రేవంత్ కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఇకపై అలాగే పిలుస్తామన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రం మర్రికుంటలో 'రైతాంగ ప్రజా నిరసన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలకు కట్టుబడకుండా "దేవుళ్ల మీద ఒట్టు.. అడిగినోళ్లకు తిట్లు" అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పది నెలల కాలంలోనే ప్రజాగ్రహానికి గురైన ప్రభుత్వం ఏదీ లేదని, అది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. అన్నదాతను హరిగోస పెడుతూ.. రైతులను చెప్పుతో కొడతామన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చెంప చెళ్లుమనిపించాలని చెప్పారు. రైతాంగ ప్రజా నిరసన సదస్సుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై జంగు సైరన్ మోగిందన్నారు. నిరంజన్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయం పండుగలాగ సాగిందని గుర్తు చేశారు. లక్ష పదివేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత నిరంజన్‌రెడ్డిదని చెప్పారు.

ప్రస్తుతం రుణమాఫీ కాక, రైతు భరోసా రాక, మద్దతు ధర లేక, రైతు బీమా రాక నానా అవస్థలు పడుతున్న రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, రైతులు, మహిళలు, వయోవృద్ధులకు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నారని, వాళ్ల సంగతి తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత తేలుస్తామని అన్నారు.

సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్

- 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతిని జీడిమెట్ల పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నకిలీ పత్రాలతో ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం నిందితులకు సహకరించారన్న ఆరోపణలతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను మేడ్చల్ కోర్టులో హాజరుపర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించింది. పూర్తి వివరాల్లోకెళ్తే..

ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన లెండ్యాల సురేష్‌కు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని సుభాష్‌నగర్ ప్రాంతంలో 200 గజాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంపై సుభాష్‌నగర్‌కు చెందిన బిఆర్ఎస్ మహిళా నేత పద్మజారెడ్డి కన్నుపడింది. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు హయత్‌నగర్‌కు చెందిన కరుణాకర్‌ను సంప్రదించి, ఆయనకు రూ.3.50 లక్షలు ఇచ్చి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేయించారు. ఈ స్థలం యజమాని 1992లోనే మృతిచెందినట్టు డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. అలాగే, రవిశంకర్ అనే వ్యక్తిని లెండ్యాల సురేష్‌కు కుమారుడిగా చూపారు. ఆధార్ కేంద్రం ఆపరేటర్ నరేంద్ర సాయంతో హరీశ్ అనే వ్యక్తిని రవిశంకర్‌గా చూపించి ఫేక్ పాన్‌కార్డు తయారు చేశారు. ఈ పాన్ కార్డు సాయంతో ఆధార్‌లో మార్పులు చేశారు. 2023 ఫిబ్రవరిలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన జ్యోతి సహకారంతో బిఆర్ఎస్ నేత పద్మజారెడ్డి సోదరికి ఈ స్థలాన్ని రవిశంకర్ అమ్మినట్టు రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాత తన స్థలం కబ్జా చేశారని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. అసలు విషయం వెలుగుచూసింది.

పద్మజారెడ్డితో పాటు సబ్ రిజిస్ట్రార్ జ్యోతిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇటీవల పద్మజారెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు తాజాగా ప్రస్తుతం సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జ్యోతిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోర్టులో హాజరుపర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించింది. నకిలీపత్రాలు, ల్యాప్‌టాప్‌లు, స్కానర్ ఇతర పరికరాలను పోలీసులు సీజ్ చేశారు.

పిఎన్‌బి విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి -హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) అక్టోబర్ 28 నుంచి నవంబర్ మూడు వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ఆ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ ఆఫీసు హెడ్ దీపక్ కుమార్ ఆధ్వర్యంలో మినీ మారథాన్ (వాక్‌థాన్) ఏర్పాటు చేశారు. సంజీవ్ పార్క్ సమీపంలో చేపట్టిన ఈ వాకథాన్‌లో ఆ బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విజిలెన్స్‌పై అవగాహన కల్పించారు.

ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ విజేతల ఎంపిక

హైదరాబాద్ : ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా హైదరాబాద్‌లో తన "ఇండియా కా సెలబ్రేషన్" ప్రచారం విజేతలను ప్రకటించింది. ఈ ప్రచారంలో భాగంగా ఎల్‌జి ఉత్పత్తులు కొనుగోలు చేసే కస్టమర్లకు ప్రత్యేకమైన ఎల్‌జి డ్రీమ్ హోమ్ ప్యాకేజీ గెలుచుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొంది. ఇందులో దేశ వ్యాప్తంగా 44 మంది బహుమతిని గెలుచుకోగా.. హైదరాబాద్ నుంచి ఆరుగురు ఎంపికయ్యారని తెలిపింది.

బాలికపై సామూహిక లైంగికదాడి

- నిందితులను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బాలికపై ముగ్గురు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. హుస్నాబాద్ ఎసిపి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణానికి చెందిన బోనాల శేఖర్, మల్యాల ప్రభాస్, గుర్రం భరత్.. సోమవారం రాత్రి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి తెలిపారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేయాలి

- ఎంపి అనిల్‌కుమార్ యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ఎమ్మెల్యేందరికీ డ్రగ్స్ టెస్టులు చేయాలని ఎంపి అనిల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'డ్రగ్స్ బయట పడిన ప్రతిసారి వాళ్లు బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలి. రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని వెనుకేసుకరావడానికి కెటిఆర్‌కు సిగ్గు ఉండాలి. గత ప్రభుత్వం డ్రగ్స్ కేసును ఏ విధంగా దారి మళ్లించిందో ప్రజలకు తెలుసు. జన్వాడ ఫామ్ హౌస్ అంటేనే వివాదాలకు కేంద్రం. ఒకసారి దీపావళి ఫెస్టివల్, ఇంకోసారి గృహ ప్రవేశం అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేస్తుంటే, వాళ్లు డ్రగ్స్‌ను ప్రేరేపించాలని చూస్తున్నారు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

గొర్రెల మందపై పులి దాడి రెండు గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో వారం రోజులుగా పులి సంచరిస్తోంది. తాజాగా సోమవారం రాత్రి బుగ్గగట్టు సమీపం లోని మామిడి తోటల ప్రాంతంలో గొర్రెల మందపై దాడి చేసింది. ఓ గొర్రెను చంపి కొంత భాగం అక్కడే తినేసింది. మరో గొర్రె పిల్లను నోట కరచుకుని సమీపంలోని అడవి లోకి వెళ్లింది. అది చూసి భయాందోళనకు గురైన గొర్రెల కాపరులు దుప్పట్లు అడ్డుపెట్టు కొని ఓ పక్కన దాక్కున్నారు. మూడ్రోజులుగా ఆ ప్రాంతంలో పులి గండ్రిస్తోందని స్థానిక రైతులు చెబుతున్నారు. సోమవారం రాత్రి గొర్రెల మందపై దాడి అనంతరం కొన్ని గంటలపాటు పులి గాండ్రించినట్లు చెబుతు న్నారు. గొర్రెల మందపై దాడి చేసింది పులి అని గొర్రెల కాపరులు చెబుతుంటే, అధికారులు మాత్రం అది పెద్ద చిరుత అయి ఉండొచ్చం టున్నారు. రెండ్రోజుల కిందట ఇదే ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని సమీప గ్రామాల్లో డప్పు చాటింపు చేసిన ఫారెస్ట్ అధికారులు ఇప్పుడేమో పెద్దపులి కాదు చిరుత అంటున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇంజనీరింగ్, లా కాలేజీల మంజూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఇంజనీరింగ్, లా కాలేజీలు మంజూరు అయ్యాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో విద్యాభివృద్ధికి ఎంతో మేలు చేకూరుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా రంగంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా చాలా వెనుకబడిందనీ, విద్యా రంగంలో ఇంకా పురోగతి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం నాయకులు

5, 6న గిరిజన సమ్మేళనం జయప్రదం చేయండి

- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలో నవంబర్ 5, 6వ తేదీల్లో జరిగే గిరిజన సమ్మేళనం జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానాయక్, ఆర్ శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని గిరిజనుల హక్కులను కాపాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో చేర్చి రాష్ట్రంలోనూ గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలిపారు. గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయక్, హిరునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఐకెపి విఒఎలకు శ్రీనిధి ప్రోత్సాహకం ఏదీ?

- పెండింగ్ వేతనాలివ్వాలి
- నవంబర్ 11,12 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద 48 గంటల ధర్నాలు : ఎస్‌వి రమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విఒఎలకు శ్రీనిధి ప్రోత్సాహకాలివ్వాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమ కోరారు. ఇవే డిమాండ్లపై నవంబర్ 11,12 తేదీల్లో కలెక్టరేట్ల ఎదుట 48 గంటల ధర్నాలు చేయనున్నట్టు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. విఒఎల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విఓఎలకు ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రూ.పది లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐడి కార్డులు, యూనిఫాం ఇవ్వాలని విన్నవించారు. రాజకీయ వేధింపులను అరికట్టాలని కోరారు. విఒఎల హక్కుల కోసం దశలవారీగా పోరాటాలు చేస్తామని చెప్పారు. నవంబర్ నాలుగో తేదీన మండల సమైక్య ఆఫీసుల వద్ద ధర్నాలు, నవంబర్ 11, 12 తేదీల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలకు పిలుపునిచ్చారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే శ్రీనిధి సహాయ నిరాకరణ చేస్తూ ఇతర సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఒఎల సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఎం నగేష్, సుమలత, వెంకటయ్య, రమేష్, జ్యోతి, దుర్గయ్య, రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన ఎఇ, జూనియర్ అసిస్టెంట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి జిల్లాల్లో మంగళవారం ఎసిబి నిర్వహించిన దాడుల్లో లంచం తీసుకుంటూ ప్రభుత్వ అధికారులు పట్టుబడ్డారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం మెడికల్ కళాశాలలో 49 అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆరునెలల జీతాల బిల్లులు చేసేందుకు మెడికల్ కళాశాల ఎఒ ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్.. ఏజెన్సీ వారిని రూ.15 లక్షలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేమని రూ.ఏడు లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అందులో రూ.మూడు లక్షలు.. బాధితుల నుంచి మెడికల్ కళాశాలలో ఖలీలుల్లా, సుధాకర్ తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి వై రమేష్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఎఇగా పనిచేసిన ఎంకోబా కాంట్రాక్టర్ దగ్గర రూ.50వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. ప్రస్తుతం ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఎఇగా పనిచేస్తున్న ఎంకోబా.. గతంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎఇగా పని చేశారు. ఆ సమయంలో రాజేంద్రనగర్‌లో ఓ కాంట్రాక్టర్ పెండింగ్ బిల్లు విషయం లో ఫైల్ కంప్లీట్ చేయడానికి కాంట్రాక్టర్‌ను ఎంకోబా రూ.50వేలు అడిగారు. కాంట్రాక్టర్ ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో రూ.50వేలు తీసకుంటూ ఎసిబి అధికారులు పట్టుకున్నారు. అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్టు అధికారులు తెలిపారు.

ప్రజల పక్షాన కొట్లాడుతాం

- మాజీ మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందటంతో సిఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఒత్తిడి, కుంగుబాటుకు లోనవుతున్నారనీ, అందులో భాగంగానే బిఆర్ఎస్‌పై రాజకీయ వేధింపుల ప్రహసనం మొదలైందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. రానున్నరోజుల్లో తమపై మరిన్ని వేధింపులుంటాయని పేర్కొన్నారు. తమకు మద్దతుగా నిలుస్తున్న పార్టీ శ్రేణులకు, సోషల్‌మీడియా వారియర్లకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వ్యక్తిగత దాడులను, కుట్రలను, అబద్ధపు ప్రచారాలను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాంగ్రెస్ కుట్రపూరితంగా పెయిడ్ ఆర్టిస్టులతో దుర్మార్గపూరిత కుట్రలు చేయిస్తున్నదని వాపోయారు. బిజెపి, కాంగ్రెస్, టీడీపీ, వాటి కనుసన్నల్లో నడుస్తున్న సోషల్‌మీడియా అంతా కలిసి బిఆర్ఎస్‌ను టార్గెట్ చేయబోతున్నదని పేర్కొన్నారు. ఇలాంటి కుటిల ప్రయత్నాలను చూసి బిఆర్ఎస్ శ్రేణులు ఆయోమయానికి గురికావొద్దని సూచించారు. ప్రజాసమస్యలపై పోరాటాల నుంచి పక్కకు తప్పొద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిని, అసమర్థతను, హిపోక్రసీని ఎత్తిచూపుదామనీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.